www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

శనివారం, 18-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :79 Issue : 79 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## జలంధర్ సభలో ప్రధానికి ఘన స్వాగతం



5




## 'జైలర్ 2' తెలుగు హక్కులకు భారీ డిమాండ్..

8




## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

2

## పల్నాడులో క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం..

- అభివృద్ధికి రుణాలే ఇంధనం: సీఎం చంద్రబాబు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి – రైతులు, మహిళలు, యువత, చిరు వ్యాపారులకు భారీగా రుణాల పంపిణీ

5



# ధరణి వివాదాలపై సర్కార్ నజర్

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణకు గ్రీన్ సిగ్నల్
వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు
భూ లావాదేవీల్లో అక్రమాలు, అవకతవకలపై లోతైన విచారణకు నిర్ణయం
ధరణి పోర్టల్‌లో జరిగిన అన్ని కీలక లావాదేవీలను పరిశీలించనున్న సిట్
గ్రామ పంచాయతీల సొంత ఆదాయం నేరుగా ఆయా ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం
స్థానిక సంస్థల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి ప్రభుత్వం ప్రాధాన్యం
పంచాయతీల నిధుల వినియోగంలో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
పలు పరిపాలనా, అభివృద్ధి అంశాలపైనా మంత్రివర్గంలో విస్తృత చర్చ
త్వరలో పూర్తి స్థాయి కేబినెట్ నిర్ణయాలను అధికారికంగా వెల్లడించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి అన్ని లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించింది.
ధరణి పోర్టల్ అమలులో జరిగిన భూ రిజిస్ట్రేషన్లు, భూముల బదిలీలు, యాజమాన్య మార్పులు, ఫిర్యాదులు, వివాదాస్పద లావాదేవీలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలు సహా అన్ని కోణాల్లో విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్,

మిగతా 3వ పేజీలో..



2

## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర..

- శ్రీహరికోట నుంచి భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' (మిషన్ ఆగమన్) ప్రయోగానికి స్కైరూట్ సంస్థ సర్వం సిద్ధం చేసింది.
- 7 అంతస్తుల ఎత్తున్న ఈ రాకెట్‌ను కార్బన్ కాంపోజిట్‌తో, 3డీ ప్రింటెడ్ ఇంజిన్లతో తయారు చేశారు; ఇది 350 కిలోల బరువును కక్ష్యలోకి తీసుకెళ్లగలదు.
- ఈ ప్రయోగంలో భాగంగా ప్రధాని మోదీ స్వయంగా 'వందేమాతరం' అని చేతితో రాసిన ప్రత్యేక పోస్ట్‌కార్డు అంతరిక్షంలోకి వెళ్లనుంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

- కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్ ప్రారంభం
- ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.
- ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ

2




## రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి వెల్లడి
సంగారెడ్డిలో సర్ శిబిరాల పరిశీలన
బీఎల్వోలతో మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి
పట్టణాల్లో 45 శాతం డిజిటైజేషన్
పార్టీ ప్రతినిధుల గుర్తింపు కార్డులపై ఆరా
గడువు దృష్టిలో పెట్టుకుని ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన
పీఎల్వో, బీఎల్వోల సహకారంతో కొనసాగుతున్న సర్
ఎన్యూమరేషన్ పత్రాలపై అధికారులకు కీలక ఆదేశాలు



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**
రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని

మిగతా 2వ పేజీలో..

## గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

ఏటీఎస్ అదుపులో ఐదుగురు ముష్కరులు
విఫలమైన టైమ్ బాంబు పరీక్ష
ఉగ్రవాద నెట్‌వర్క్‌పై గుజరాత్ ఏటీఎస్ సర్జికల్ స్ట్రైక్
జులై 24 వరకు పోలీస్ కస్టడీకి అప్పగించిన న్యాయస్థానం
మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ముందు నిందితుల హాజరు
నిందితులపై 'ఉపా' చట్టం కింద కఠినమైన సెక్షన్లతో కేసులు
దేశద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపిన అధికారులు



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
పాకిస్థాన్ సరిహద్దులను ఆనుకుని ఉన్న గుజరాత్ రాష్ట్రంలో భారీ ఉగ్రవాద కుట్రను భద్రతా బలగాలు విజయవంతంగా భగ్నం చేశాయి. పాక్ కేంద్రంగా

మిగతా 2వ పేజీలో..

విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?..

## పాఠశాలపై కేసు

- సైదాబాద్‌లో ప్రైవేట్ స్కూల్‌పై తల్లిదండ్రుల ఫిర్యాదు
- రెండో తరగతి విద్యార్థితో 'సూరా అల్-ఫాతిహా' పఠనం చేయించారనే ఆరోపణ
- రోజూ ప్రార్థన చేయాలంటూ స్కూల్ డైరీలో నమోదు చేశారని ఫిర్యాదు
- బాలుడు భయాందోళనకు గురవుతున్నాడని తల్లిదండ్రుల ఆవేదన
- ప్రిన్సిపాల్, యాజమాన్యం,
- టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించారనే ఆరోపణలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు

మిగతా 2వ పేజీలో..







## దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

- హరియాణాలోని జింద్ నుండి సోనిపట్ వరకు
- 89 కిలోమీటర్ల దూరం, 2 గంటల ప్రయాణ వ్యవధి.
- జింద్ సిటీ, గోహానా, మోహనా సహా మొత్తం 12 స్టాపింగ్‌లు.
- ఒకేసారి 2,600 మంది ప్రయాణించే సదుపాయం.
- బాహ్య విద్యుత్ తీగలు లేకుండా నడిచే 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ'

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
భారతదేశ రవాణా రంగంలో పర్యావరణ విప్లవానికి నాంది పలుకుతూ భారతీయ రైల్వే ఒక అద్భుతమైన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. పర్యావరణానికి ఎలాంటి కాలుష్య భారం లేదా నష్టం వాటిల్లకుండా, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే క్రమంలో

మిగతా 2వ పేజీలో..




## మహిళల భద్రతకు సీపీ సజ్జనార్ కీలక ముందడుగు

- 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే'తో హాస్టళ్లు, పీజీల్లో భద్రతా ప్రమాణాల పెంపు – నగర పోలీసుల సంచలన నిర్ణయం

4

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

నామినేషన్ పత్రాల్లో ఏ కాలమ్ ఖాళీగా వదిలినా, సమాచారం దాచినా నామినేషన్ చెల్లదు. ఇందులో ఎలాంటి రాజీ ఉండదు.
మీనాక్షి నటరాజన్‌కు కేసు వివరాలు నమోదు చేసే అవకాశం ఇచ్చినా ఉపయోగించుకోలేదు.
రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోలేదు.

2



## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన రఘురామ

- భుజం సర్జరీ తర్వాత ముంబైలో కోలుకుంటున్న పవన్ కల్యాణ్
- పవన్‌ను పరామర్శించిన రఘురామ, బాలినేని, జనసేన నేతలు

3



# బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.

కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 80 శాతం పూర్తికాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. శిబిరాల్లో జరుగుతున్న నమోదు, డిజిటైజేషన్, పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్వోలు) నేరుగా మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న స్పందన, నమోదు ప్రక్రియ పురోగతి గురించి ఆరా తీశారు. డిజిటైజేషన్ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిబిరాల వద్ద వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉండటాన్ని గమనించిన సుదర్శన్‌రెడ్డి, వారికి పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రక్రియ నిర్వహించాలని, పారదర్శకతకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సర్ ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. పీఎల్వోలు, బీఎల్వోల సమన్వయంతో సర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా సజావుగా సాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందని ప్రాంతాల్లో వెంటనే సంబంధిత సూపర్‌వైజర్లను సంప్రదించి పత్రాలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?.. పాఠశాలపై కేసు

మొదటిపేజీ తరువాయి

నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం, తరగతి గదిలో సదరు విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలో భాగమైన 'సూరా అల్‌ఫాతిహా' పఠనం చేయాలని ఉపాధ్యాయులు ఆదేశించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా, ప్రతిరోజూ ఆ ప్రార్థన చదవాలని స్కూల్ డైరీలో కూడా సూరా అల్‌ఫాతిహా అని రాసి ఒత్తిడి తీసుకొచ్చారని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు వ్యవహరించారని, దీంతో తమ కుమారుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రతిరోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులు కూడా ఉల్లంఘించబడ్డాయని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, తరగతి ఉపాధ్యాయురాలిని నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 75 కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యార్థిపై మానసిక ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు, పాఠశాల యాజమాన్యం వివరణ, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం స్పందన ఇంకా వెల్లడికాలేదు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

- **కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్ ప్రారంభం**
- **ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.**
- **ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.**

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నగదు రహిత చికిత్స కోసం ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చిందని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమన్వయంతో పనిచేసిందని భట్టి చెప్పారు. ఇకపై వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని, వారిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని పేర్కొన్నారు.

సుమారు 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఈహెచ్ఎస్‌ను తీసుకొచ్చామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల మంది పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు.

# గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న నిషేధిత ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఒక ప్రమాదకరమైన ముఠాను గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా పరిధిలోని సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో ఏటీఎస్ బృందాలు జరిపిన మెరుపు దాడుల్లో ఐదుగురు ముష్కరులు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకున్న నిందితులను బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా అధికారులు అధికారికంగా గుర్తించారు.

ఖడియాల్ గ్రామంలో పట్టుబడిన ఈ ఐదుగురు జైషే మహ్మద్ నిందితులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య మెహసానా జిల్లా కోర్టుకు తరలించారు. అక్కడ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ఎదుట నిందితులను హాజరుపరిచారు. ఈ ఉగ్రవాద ముఠా వెనుక ఉన్న అంతర్జాతీయ లింకులు, భవిష్యత్ దాడుల ప్రణాళికలను రాబట్టడానికి నిందితులను విచారించాల్సిన అవసరం ఉందని ఏటీఎస్ కోర్టుకు విన్నవించింది. ఏటీఎస్ వాదనలతో ఏకీభవించిన మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా.. నిందితులు ఐదుగురిని ఈనెల జులై 24వ తేదీ వరకు ఏటీఎస్ పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుజరాత్ రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు, యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ఈ ముఠా ప్రయత్నిస్తోందని ప్రాథమిక విచారణలో తేలింది. దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా వ్యవహరించిన ఈ నిందితులపై దేశంలోనే అత్యంత కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. 'ఉపా' చట్టంలోని సెక్షన్లు 13, 17, 18, 38, 39లతో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 148, 61 కింద నిందితులపై దేశద్రోహం, ఉగ్రవాద నిధుల సేకరణ, కుట్రపూరిత చర్యల కింద కేసులు నమోదు చేసి ఉక్కుపాదం మోపారు. ఈ తాజా అరెస్టులు ఆకస్మికంగా జరిగినవి కావు, గత కొన్ని రోజులుగా ఏటీఎస్ జరుపుతున్న సుదీర్ఘ దర్యాప్తులో భాగమేనని అధికారులు స్పష్టం చేశారు. అంతకుముందు జులై 3వ తేదీన గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న జైషే మహ్మద్‌కు చెందిన ఎనిమిది మంది ముష్కరులను ఏటీఎస్ విజయవంతంగా పట్టుకుంది. ఆ ఎనిమిది మంది నిందితులను ప్రత్యేక బృందాలు థర్డ్ డిగ్రీ మరియు శాస్త్రీయ పద్ధతుల్లో విచారించగా, వారి ఇచ్చిన సమాచారం మరియు కీలక లీకుల ఆధారంగానే తాజాగా పటన్ జిల్లాలో తలదాచుకున్న ఈ ఐదుగురు నిందితుల పేర్లు మరియు రహస్య స్థావరాల వివరాలు బయటపడ్డాయి.

కోర్టు విచారణ సందర్భంగా ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ న్యాయస్థానానికి ఒక సంచలన విషయాన్ని వివరించారు. అరెస్టైన ఐదుగురు నిందితులలో ఒకరు గుజరాత్ మట్టిపై భారీ పేలుడు సంభవించేలా ఒక ప్రమాదకరమైన క్రూడ్ టైమ్ బాంబును సొంతంగా తయారు చేయడానికి ప్రయత్నించాడని కోర్టుకు తెలిపారు. అంతటితో ఆగకుండా, తయారు చేసిన ఆ బాంబు పనితీరును పరీక్షించేందుకు (టెస్టింగ్) ఒక నిర్మానుష్య ప్రాంతంలో విఫల యత్నం కూడా చేశాడని ఏటీఎస్ దర్యాప్తులో తేలిందని పీఆర్ దంతానీ న్యాయమూర్తికి వివరించారు. నిందితులను కస్టడీకి కోరడానికి గల కారణాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ కోర్టు ముందు ఉంచారు. నిందితులు టైమ్ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించినప్పటికీ అది సాంకేతిక లోపాల వల్ల విఫలమైందని, అయితే వారు బాంబు తయారీకి ఉపయోగించిన ముడి సరుకులు, రసాయనాలు ఎక్కడి నుంచి సేకరించారు? వాటిని ప్రస్తుతం ఎక్కడ దాచిపెట్టారు? అనే విషయాలను కనుగొనాల్సి ఉందన్నారు. అలాగే నిందితుల వద్ద ఉర్దూ భాషలో ఉన్న జైషే మహ్మద్ ఉగ్రవాద ప్రచార సాహిత్యానికి సంబంధించిన నిషేధిత పుస్తకాలు ఉన్నాయని, వాటిని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నందున నిందితుల రహస్య స్థావరాలకు తీసుకెళ్లి శోధించాల్సి ఉందని తెలిపారు.

గుజరాత్ ఏటీఎస్ జరిపిన లోతైన విచారణలో ఈ ఉగ్రవాద మాడ్యూల్ యొక్క సరఫరాదారుల లింకులు కూడా బయటపడ్డాయి. జులై 3న అరెస్టయిన మొదటి ముఠాలోని కీలక సభ్యుడైన మహమ్మద్ అమీన్ షేరా అనే ముష్కరుడు, తాజాగా పట్టుబడిన ఈ ఐదుగురు సభ్యుల ముఠాకు బాంబు తయారీకి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పేలుడు పదార్థాల సామగ్రిని సరఫరా చేసినట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు. జైషే మహ్మద్ తన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను గుజరాత్‌లో బలంగా నాటడానికి ఈ ఇరు ముఠాలను ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ వెనుక నుండి నడిపించిన అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో దర్యాప్తు వేగవంతమైంది.

జైషే మహ్మద్ ఉగ్రసంస్థ గుజరాత్‌లోని ప్రముఖ నగరం అహ్మదాబాద్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను ఒక వ్యూహం ప్రకారం విస్తరించడానికి ప్రయత్నించిందని ఏటీఎస్ స్పష్టం చేసింది. జులై 3న దొరికిన అహ్మద్, ఇబ్రహీం, ముదస్సిర్, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్, మహమ్మద్ అమీన్ షేరా, మహమ్మద్ అబ్దుల్, బిలాల్ మహమ్మద్ లలో ఏడుగురు గుజరాత్‌కు చెందినవారు కాగా, ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లను విశ్లేషించగా వందల సంఖ్యలో దేశ వ్యతిరేక డిజిటల్ ఫైళ్లు, చాటింగ్‌లు లభ్యమయ్యాయి. ఈ మాడ్యూల్ కేవలం గుజరాత్‌కే పరిమితం కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే ప్రమాదకరమైన ప్లాన్ చేసిందని, తాజా అరెస్టులతో ఆ కుట్రలన్నీ పూర్తిగా భగ్నమయ్యాయని ఏటీఎస్ అధికారులు వెల్లడించారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర..

- **ఈ ప్రయోగంలో భాగంగా ప్రధాని మోదీ స్వయంగా 'వందేమాతరం' అని చేతితో రాసిన ప్రత్యేక పోస్ట్‌కార్డు అంతరిక్షంలోకి వెళ్లనుంది.**
- **ప్రధాని కార్డుతో పాటు ఇస్రో ప్రస్తుత/మాజీ చైర్మన్లు, వ్యోమగాములు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లనుంది.**
- **శాస్త్రవేత్తలు సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాంలకు నివాళిగా 18 క్యారెట్ల బంగారంతో చేసిన వారి సూక్ష్మ విగ్రహాలను ఇందులో పంపుతున్నారు.**

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ 'మిషన్ ఆగమన్' పేరిట రూపొందించిన 'విక్రమ్ 1' రాకెట్‌ను శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనుంది. భారత భూభాగం నుంచి కక్ష్యలోకి వెళ్లనున్న తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్ 1 ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

ఈ ప్రయోగంలో సాంకేతిక పరికరాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చేతితో రాసిన ఒక ప్రత్యేక పోస్ట్‌కార్డును కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఆ పోస్ట్‌కార్డుపై ప్రధాని 'వందేమాతరం' అని రాయడం విశేషం. ఇది భారత అంతరిక్ష ప్రయాణంలో ఒక ప్రతీకాత్మక గుర్తుగా నిలవనుంది.

ప్రధాని మోదీ పోస్ట్‌కార్డుతో పాటు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారతీయ వ్యోమగాములు, స్కైరూట్ సంస్థ బృందం, సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులను కూడా విక్రమ్ 1 అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. భారత అంతరిక్ష రంగ అభివృద్ధికి తోడ్పడిన అనేక మంది జ్ఞాపకాలను ఈ ప్రయోగం సాక్ష్యంగా నిలపనుంది.

**భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి మైలురాయి**

విక్రమ్ 1 రాకెట్ దాదాపు ఏడు అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది. పూర్తిగా కార్బన్ కాంపోజిట్ పదార్థంతో దీనిని తయారు చేశారు. రాకెట్‌లోని ఇంజిన్లను అత్యాధునిక 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించారు. భూమికి సమీప కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి సుమారు 350 కిలోల పేలోడ్‌ను తీసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది.

**విక్రమ్-ఎస్ విజయంతో ముందడుగు**

2022 నవంబరులో స్కైరూట్ సంస్థ 'విక్రమ్‌ఎస్' అనే సబ్‌ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు పూర్తి స్థాయి ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకెళ్లగల 'విక్రమ్ 1'తో మరో కీలక ఘట్టాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ముగ్గురు మహా శాస్త్రవేత్తలకు వినూత్న నివాళి**

విక్రమ్ 1 రాకెట్‌లో సాంకేతిక పరికరాలు, పోస్ట్‌కార్డులతో పాటు ప్రత్యేక మైక్రోఆర్ట్‌ను కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. భారత దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ విగ్రహాలను ఈ ప్రయోగంలో పంపించనున్నారు.

మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ మట్టెవాడ 18 క్యారెట్ల బంగారంతో చిన్న రాకెట్ ఆకృతిని రూపొందించి, అందులో ఈ ముగ్గురు శాస్త్రవేత్తల సూక్ష్మ విగ్రహాలను చెక్కారు. భారత అంతరిక్ష రంగానికి వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా స్కైరూట్ ఈ వినూత్న నివాళిని అర్పిస్తోంది. 'మిషన్ ఆగమన్' విజయవంతమైతే భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఇది మరో గొప్ప మైలురాయిగా నిలవడంతో పాటు ప్రపంచ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ మార్కెట్లో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలంగా చాటనుంది.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో నిబంధనల అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన ప్రత్యేక చిట్‌చాట్‌లో ఈ వివాదానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు.నామినేషన్ పత్రాల్లో అడిగిన ప్రతి కాలమ్‌ను అభ్యర్థులు తప్పనిసరిగా పూర్తి చేయాలని సీఈసీ తెలిపారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థులు ఏ చిన్న సమాచారాన్నైనా దాచిపెట్టినా లేదా ఖాళీగా వదిలినా నామినేషన్ చెల్లుబాటుపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కొన్నిసార్లు రిటర్నింగ్ అధికారులు మానవీయ కోణంలో చిన్న తప్పులను పట్టించుకోకపోయినా.. రాజకీయ ప్రత్యర్థులు వాటిని అభ్యంతరంగా లేవనెత్తితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ విషయంలో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి తగిన అవకాశం ఇచ్చారని జ్ఞానేష్ కుమార్ తెలిపారు. అయితే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడంతో రిటర్నింగ్ అధికారి స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఒకసారి రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకునే అవకాశం లేదని సీఈసీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్నే న్యాయస్థానం సమర్థించిందని ఆయన గుర్తు చేశారు.

# దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే మొట్టమొదటిసారిగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే సరికొత్త రైలు పట్టాలెక్కింది. హరియాణా రాష్ట్ర వేదికగా ఈ సరికొత్త సాంకేతిక రైలు తన తొలి ప్రయాణాన్ని అత్యంత విజయవంతంగా ప్రారంభించి, భారత రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అధికారిక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ హైడ్రోజన్ రైలును పచ్చజెండా ఊపి, అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జింద్ నుంచి సోనిపట్ స్టేషన్ల మధ్య ఉన్న సుమారు 89 కిలోమీటర్ల దూరాన్ని ఈ వినూత్న రైలు కేవలం రెండు గంటల వ్యవధిలోనే చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రయాణ మార్గంలో జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, బర్వాస్ని సహా మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ప్రయాణికుల కోసం ఆగుతుందని రైల్వే శాఖ స్పష్టం చేసింది.

ఈ అత్యాధునిక రైలు కేవలం పర్యావరణ హితమైనదే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఒక అరుదైన రికార్డును సైతం తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 3,200 హార్స్ పవర్ (హెచ్‌పీ) సామర్థ్యం గల అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ పవర్ ట్రైన్ ప్రొపల్షన్ వ్యవస్థతో నడిచే ఈ రైలుకు మొత్తం 10 భారీ బోగీలను (కోచ్‌లను) అమర్చారు. ప్రపంచంలోనే మరే దేశంలోనూ లేని విధంగా, ఇంతవరకు అందుబాటులో ఉన్న హైడ్రోజన్ రైళ్లన్నింటికంటే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలుగా ఇది అంతర్జాతీయ రికార్డు సృష్టించింది. ఈ ఒకే రైలులో ఒకేసారి ఏకంగా 2,600 మంది ప్రయాణికులు అత్యంత సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు.

ప్రస్తుతం మన దేశంలో విస్తృతంగా నడుస్తున్న సాంప్రదాయ విద్యుత్ రైళ్లు పైన ఉండే కరెంట్ తీగల (ఓవర్ హెడ్ వైర్లు) నుంచి విద్యుత్‌ను గ్రహించి నడుస్తాయి. అయితే, దానికి పూర్తిగా భిన్నంగా ఈ సరికొత్త రైలుకు ఎలాంటి బాహ్య విద్యుత్ తీగలతో అవసరం లేదు. ఇది విప్లవాత్మకమైన 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ' సహాయంతో నడుస్తుంది. అంటే, ఈ రైలు తన ఇంజిన్ లోపలే హైడ్రోజన్‌ను విద్యుత్ శక్తిగా మార్చుకుని, సొంతంగా కరెంటును తయారు చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఈ రసాయన ప్రక్రియలో కేవలం ప్యూర్ నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా బయటకు వస్తుంది కాబట్టి పర్యావరణానికి ఒక శాతం కూడా కాలుష్య ముప్పు ఉండదు.

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, మన దేశీయ ఇంజినీర్ల అద్భుత నైపుణ్యంతో రూపుదిద్దుకున్న ఈ హైడ్రోజన్ రైలు మేక్ ఇన్ ఇండియా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. పాతకాలపు డీజిల్ ఇంజిన్ల వల్ల విపరీతంగా వెలువడే ప్రమాదకర కార్బన్ ఉద్గారాలకు ఈ రైలు పూర్తిగా చెక్ పెట్టనుంది. అంతేకాకుండా, శిలాజ ఇంధనాల కొరత ఉన్న మన దేశంలో డీజిల్ కోసం విదేశాల నుంచి భారీగా దిగుమతులు చేసుకోవడానికి అయ్యే విదేశీ మారక ద్రవ్య భారం కూడా ఈ సాంకేతికత ద్వారా భవిష్యత్తులో క్రమంగా తగ్గుతుంది. సాధారణ డీజిల్ ఇంజన్లతో పోలిస్తే ఇది ప్రయాణ సమయంలో చాలా తక్కువ శబ్దం చేస్తూ ప్రయాణికులకు నిశ్శబ్ద వాతావరణాన్ని అందిస్తుంది.

రైలు ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ హైడ్రోజన్ రైలు ప్రారంభంతో అంతర్జాతీయ స్థాయిలో హరియాణా రాష్ట్ర పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. భారత రైల్వే ఆధునికీకరణ రూపురేఖలను మార్చడంలో ఇది ఒక చారిత్రాత్మక ముందడుగు అని కొనియాడారు. 2014వ సంవత్సరం వరకు దేశంలో రైల్వే లైన్ల విద్యుద్దీకరణ కేవలం 30 శాతం మాత్రమే ఉండేదని గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం వచ్చిన గత 12 ఏళ్ల పాలనా కాలంలో దానిని ఏకంగా 99 శాతానికి పెంచి రికార్డు సృష్టించామని వివరించారు. భవిష్యత్ అవసరాలను ముందే గుర్తించి, ముందుచూపుతోనే తమ ప్రభుత్వం రూ.14 వేల కోట్లతో రైల్వే, రోడ్డు మౌలిక వసతుల పనులను వేగంగా చేపడుతోందన్నారు.

ప్రయాణికుల రక్షణకు ఈ రైలులో అత్యున్నత ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో అమర్చిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు హైడ్రోజన్ గ్యాస్ లీకేజీ, ఓవర్ హీటింగ్, మంటలు లేదా పొగ వంటి ఎలాంటి అత్యవసర ప్రమాదకర పరిస్థితులు తలెత్తినా కేవలం సెకన్ల వ్యవధిలోనే గుర్తించి లోకో పైలట్‌ను అప్రమత్తం చేస్తాయి. ఒకవేళ ఎక్కడైనా లీకేజీ జరిగితే, గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డిజైన్ చేసిన ప్రత్యేక వెంటిలేషన్ వ్యవస్థ ఆ గ్యాస్‌ను గాల్లోకి పంపి పలుచబడేలా చేస్తుంది. ఒకవేళ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే, రైలులోని 'ఆటోమేటిక్ షట్ ఆఫ్' వ్యవస్థ క్షణాల మీద తనంతట తానుగా హైడ్రోజన్ ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేసి పెద్ద ప్రమాదాలు జరగకుండా కాపాడుతుంది.

ఈ నూతన హైడ్రోజన్ ప్యాసింజర్ రైలు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటుందని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. రైలును ఎల్లప్పుడూ సురక్షితమైన స్థితిలో ఉంచేందుకు వీలుగా ప్రతి ఆదివారం దీనికి ప్రత్యేక షెడ్యూల్డ్ నిర్వహణ పనులు మరియు కఠినమైన సాంకేతిక తనిఖీలను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రతి శనివారం రాత్రి ఈ రైలును ఢిల్లీలోని ప్రసిద్ధ 'షకుర్‌బస్తి వర్క్‌షాప్'నకు తరలిస్తామని, అక్కడ నిపుణులైన ఇంజినీర్ల బృందం పూర్తి తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే సోమవారం ఉదయం తిరిగి హరియాణాలో ప్రయాణికుల సేవలకు పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



# ధరణి వివాదాలపై సర్కార్ నజర్

మొదటిపేజీ తరువాయి

విజిలెన్స్, పోలీసు తదితర శాఖల అధికారులు, భూ వ్యవహారాల నిపుణులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ధరణి వ్యవస్థపై గత కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదులు, భూ యాజమాన్య వివాదాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, రికార్డుల్లో మార్పులు వంటి ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విచారణలో బయటపడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.




అదే సమయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు వివిధ మార్గాల ద్వారా వచ్చే సొంత ఆదాయాన్ని నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం తెలిపింది. దీంతో స్థానిక సంస్థలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి పెరగడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీల ఆదాయంపై స్థానిక సంస్థలకే పూర్తి నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించే అవకాశం కల్పించడం ఈ నిర్ణయంతో సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించే అవకాశం ఉంది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలోకి దూకిన తల్లి.. కొమ్మ పట్టుకుని బతికిన కొడుకు

- **భర్త వేధింపులతో విసిగిపోయి, ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం**
- **ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతి చెందగా.. కుమారుడు సురక్షితం**
- **వ్యవసాయ బావిలోని చెట్టు కొమ్మ పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్న బాలుడు**
- **కొడుకు అరుపులు విని బావిలో దూకి రక్షించిన తండ్రి**
- **రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఈ విషాద ఘటన**

**శంకర్ పల్లి జులై 17ఆశ్వి అప్డేట్స్:**

నిత్యం తాగి వచ్చి వేధించే భర్తతో విసిగిపోయిన ఓ తల్లి, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దారుణ సంఘటనలో తల్లి, కుమార్తె ప్రాణాలు కోల్పోగా, కుమారుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వ్యవసాయ బావిలో సుమారు అరగంట పాటు ఓ చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ ప్రాణాలను నిలబెట్టుకున్నాడు.



వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా యలాల్ మండలానికి చెందిన ఊరుబాటి సుధాకర్, తన భార్య వసంత (35), కుమార్తె నవ్య (15), కుమారుడు వేణు(10)తో కలిసి బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చారు. అక్కడ ఓ తోటలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, సుధాకర్‌కు మద్యపానం అలవాటు ఉంది. ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య వసంతతో గొడవపడి, ఆమెను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించేవాడు. నిన్న రాత్రి కూడా సుధాకర్ మద్యం మత్తులో భార్యతో గొడవ పడ్డాడు. భర్త వేధింపులను ఇక భరించలేనని భావించిన వసంత, జీవితంపై పూర్తి విరక్తి చెందింది. తాను చనిపోతే పిల్లలు అనాథలవుతారనే ఆవేదనతో వారిని కూడా తనతోపాటే తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడవుగా, అర్ధరాత్రి సమయంలో నిద్రిస్తున్న కుమార్తె నవ్య, కుమారుడు వేణును తీసుకుని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ముగ్గురూ ఒక్కసారిగా బావిలోకి దూకేశారు. అయితే, నీటిలో పడుతున్న సమయంలో బాలుడు వేణుకు బావిలోపలికి వంగి ఉన్న ఒక చెట్టు కొమ్మ చేతికి తగిలింది. ఎలాగైనా బతకాలనే ఆశతో ఆ బాలుడు ఆ కొమ్మను గట్టిగా పట్టుకుని, సుమారు అరగంట పాటు ప్రాణభయంతో వేలాడుతూ ఉండిపోయాడు. మరోవైపు ఇంట్లో భార్యాపిల్లలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సుధాకర్, చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. వ్యవసాయ బావి వద్దకు రాగానే లోపలి నుంచి కొడుకు అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి చూడగా, కొడుకు కొమ్మ పట్టుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడడం చూసి, తక్షణమే బావిలోకి దూకి అతడిని బయటకు తీసి రక్షించాడు. కానీ, అప్పటికే వసంత, నవ్య నీటిలో మునిగిపోయి ఊపిరాడక మరణించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో తల్లి, కుమార్తె మృతదేహాలను వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సర్ ప్రక్రియలో 72% శాతంతో పెద్దేముల్ గ్రామ పంచాయతీ టాప్

- **తాండూరు నియోజకవర్గంలో మొదటి స్థానంలో పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ**
- **ఆగస్టు 03లోపు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలి**
- **అర్హ్వత కలిగిన ఓటర్లు సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి**
- **పెద్దేముల్ గ్రామ పంచాయతీ 5 పోలింగ్ స్టేషన్ లలో 72% సర్ ప్రక్రియ పూర్తి**
- **పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప**

**పెద్దేముల్,జూలై 17 ఆశ్వి అప్డేట్స్:**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇప్పటి వరకు 72% శాతం పూర్తయిందని పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప తెలిపారు.శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పెద్దేముల్ గ్రామ పంచాయతీలో సర్ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోందని,తాండూరు నియోజకవర్గంలో అదే విధంగా పెద్దేముల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ 72% శాతం పురోగతితో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.గ్రామ ప్రజలందరూ బీఎల్‌వోలు (BLOలు) అందజేసిన సర్ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి తప్పనిసరిగా తిరిగి అప్పగించాలని సూచించారు.ఫారాల సమర్పణకు ఆగస్టు 03 చివరి తేదీగా నిర్ణయించబడిందని,ఆ గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణించి ఉంటే, వారి వివరాలను సంబంధిత బీఎల్‌వోలకు తెలియజేసి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఇచ్చిన ఫార్మాట్ లో మరణ వాంగ్మూలం సమర్పించాలని సూచించారు.అలాగే రెండు చోట్ల ఓటు నమోదు (డబుల్ ఓటర్లు) ఉన్నవారు సంబంధిత వాంగ్మూలం ఇవ్వాలని,చిరునామా మారిన (షిఫ్టింగ్) ఓటర్లు తమ తాజా వివరాలను బీఎల్‌వోలకు అందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్యుమరేషన్ పత్రాలను సకాలంలో సమర్పించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి లాలప్ప విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## మత్స్యగిరి గుట్ట దేవస్థానంలో టెండర్

**వలిగొండ జూలై 17ఆశ్వి అప్డేట్స్:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంగ్రామం వెంకటాపురం, మండలం వలిగొండ, జిల్లా యాదాద్రి భువనగిరి. దేవస్థానం గుట్టపైన 202627 సంవత్సరమునకు గాను (1 సంవత్సర కాలమునకు) వివిధ టెండర్స్ నిర్వహించగా 1. పూలు, పూల దండలు అమ్ముకొను టెండర్స్ రూ.4,46,009 / నాయిని దయాకర్ రెడ్డి ( . 3,51,688) 2. 4. వాహనపూజా సామాగ్రి అమ్ముకోనుహక్కు 3. వాహనముల టోల్ గేట్ (మేకలబండ వద్ద) వసూలు చేసుకొనుహక్కు కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు వాయిదా వేయడమైనదని కార్యనిర్వహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య ఒక ప్రకటనలో తెలియచేశారు. శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ శాఖ, నల్లగొండ డిప్యూట్ చేయబడిన నరేందర్ రెడ్డి కార్యనిర్వహణాధికారి, శ్రీ లింగ బసవేశ్వర స్వామి దేవాలయం పడమటి సోమారం పర్యవేక్షణలో నిర్వహించడమైనది. ఇట్టి టెండర్స్ లో గ్రామపెద్దలు, టెండర్ దారులు పాల్గొన్నారు. వాయిదా వేయబడిన టెండర్స్ నిర్వహణ వివరములను త్వరలో తెలియజేయబడును.



## శంషాబాద్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్ గౌడ్ నియామకం.

**శంషాబాద్ జూలై17ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటూ శంషాబాద్ మండలంలోని గ్రామాలన్నిటినికి అభివృద్ధి పథకాలు సమభాగాలుగా అందించడానికి నావంతు ప్రయత్నం చేయడం జరుగుతుందని శంషాబాద్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్‌గౌడ్ తెలిపారు.శుక్రవారం శంషాబాద్ మండలంలోని సర్పంచులందరూ కలసి ఒక ఫోరం ఏర్పడి సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్‌గౌడ్ ను ఎనుకోవడం జరిగిందన్నారు.అనంతరం మిగతా సభ్యులందరూ కలిసి పూర్తిస్థాయి కమిటీకి ఏకీభవించడంతో కార్యనిర్వాహ అధ్యక్షులుగా రవినాయక్,ఉపాధ్యక్షులుగా ఎలుగాని ప్రభాకర్ గౌడ్,అంకెం శ్రీలత రాజు యాదవ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్,కార్యదర్శి మౌనిక ఆంజనేయులు ముదిరాజ్,లక్ష్మి లింగం కోశాధికారిసుభాష్,సలహాదారులుగా ముదావత్ బిఖ్యానాయక్,బిక్షపతి రెడ్డి నియమితులయ్యారు.



## ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ

- **వలిగొండ ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి**

**వలిగొండ జులై 17ఆశ్వి అప్డేట్స్:**

భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి పాల్గొని పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో చెత్త,మురుగు నీరు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని,నిల్వ నీటిని తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,చికున్గున్యా వంటి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆరోగ్య శాఖ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలు వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ గండు రాములు, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్,ఆశా వర్కర్లు,ఆరోగ్య శాఖ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## చర్ల మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను సందర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

**భద్రాచలం,జూలై17ఆశ్వి అప్డేట్స్:**

భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు చర్ల మండల పర్యటనలో భాగంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించి సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాల గురించి తెలుసుకుని, మరింత శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు.

అలాగే పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం మరియు అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండలం అధ్యక్షులు విజయ్ నాయుడు సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి లంక రాజు,సీతాపతి రాజు సంబంధిత అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన రఘురామ

**ఆశ్వి అప్డేట్స్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భుజానికి శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం పలువురు పార్టీ నేతలు, ప్రముఖులు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ విప్ బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, గిడ్డి సత్యనారాయణ, అరవ శ్రీధర్ సహా పలువురు సినీ నిర్మాతలు, న్యాయవాదులు ఉన్నారు. ఆయన వేగంగా కోలుకుంటుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు.

పవన్ కల్యాణ్ కుడి భుజానికి తీవ్ర గాయం కావడంతో జూలై 11న ముంబైలోని కోకిలా బెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిన విషయం విదితమే. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దిన్షా పర్దివాలా నేతృత్వంలో సుమారు మూడున్నర గంటల పాటు 'ఆర్థ్రోస్కోపిక్ రిపేర్ సర్జరీ' విజయవంతంగా పూర్తయింది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని జనసేన పార్టీ వర్గాలు వెల్లడించాయి. పవన్ కల్యాణ్ సంపూర్ణంగా కోలుకుని, భుజం పనితీరు సాధారణ స్థితికి రావడానికి సుమారు నాలుగు నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తీసుకుంటున్న విశ్రాంతి, నొప్పి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, మరో రెండు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. 2016 నుంచి బాధిస్తున్న పాత గాయం, సినిమా షూటింగులు మరియు రాజకీయ ప్రచారాల కారణంగా మరింత తీవ్రం కావడంతో వైద్యులు శస్త్రచికిత్సను అనివార్యమని సూచించారు.



# మహిళల భద్రతకు సీపీ సజ్జనార్ కీలక ముందడుగు

- 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే'తో హాస్టళ్లు, పీజీల్లో భద్రతా ప్రమాణాల పెంపు – నగర పోలీసుల సంచలన నిర్ణయం





**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వచ్చే వేలాది మంది మహిళలు, విద్యార్థినుల భద్రతకు మరింత భరోసా కల్పించే దిశగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నాయకత్వంలో నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ *'ప్రాజెక్ట్ సేఫ్ స్టే'*ను ప్రారంభించి, హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహాలకు కొత్త భద్రతా మార్గదర్శకాలను అమల్లోకి తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థల భాగస్వామ్యంతో రూపొందించిన 'సురక్ష నివాస్-1.0' మార్గదర్శకాలు మహిళల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయి. ఈ మార్గదర్శకాలను సీపీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి మహిళా హాస్టల్, పీజీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించే వసతి గృహాలకే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, మహిళల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన తెలిపారు. పోలీసులు నిర్వహించిన ప్రత్యేక సర్వేలో 447 మహిళా హాస్టళ్లను పరిశీలించగా, సీసీటీవీలు ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్స్, అగ్నిమాపక పరికరాలు వంటి కీలక భద్రతా అంశాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ లోపాలను సరిదిద్ది కనీస భద్రతా ప్రమాణాలను తప్పనిసరి చేయడానికే కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు సీపీ వివరించారు. త్వరలో హాస్టళ్ల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అలాగే హాస్టళ్లలో పనిచేసే సిబ్బందికి పోలీస్ వెరిఫికేషన్, నివాసితుల పూర్తి వివరాల నమోదు, సీసీటీవీ వ్యవస్థల సమర్థ నిర్వహణ వంటి అంశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. మహిళల భద్రతను కేవలం పోలీసుల బాధ్యతగా కాకుండా సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అంశంగా భావిస్తూ సీపీ సజ్జనార్ చేపట్టిన ఈ చర్య నగరంలో సురక్షిత వసతి గృహాల ఏర్పాటుకు కొత్త దిశ చూపుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను మహిళలకు మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దడంలో 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే' కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



# 'స్టాండ్ విత్ హర్' ప్రచారానికి తెలంగాణవ్యాప్తంగా శ్రీకారం

- ఉన్నత విద్యా సంస్థల మాస్టర్ ట్రైనర్లకు మహిళా భద్రత విభాగం శిక్షణ

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

మహిళల భద్రత, గౌరవం, లింగ సమానత్వంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ మహిళా భద్రత విభాగం (Women Safety Wing) ఆధ్వర్యంలో "స్టాండ్ విత్ హర్" (Stand with Her) ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలకు చెందిన మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ అందించి, వారి ద్వారా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళలపై వేధింపుల నివారణ, సురక్షిత విద్యా వాతావరణం, లింగ సమానత్వం, చట్టపరమైన హక్కులు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ ప్రచారం ప్రధాన ఉద్దేశ్యమని మహిళా భద్రత విభాగం తెలిపింది. మాస్టర్ ట్రైనర్లు తమ తమ విద్యాసంస్థల్లో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఇంటరాక్టివ్ సెషన్లు, చర్చా వేదికలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి "స్టాండ్ విత్ హర్" సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. విద్యా సంస్థల్లో మహిళలకు సురక్షిత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడంతో పాటు బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు.

# కల్తీ నెయ్యిపై ఫుడ్ సేఫ్టీ శాఖ ఉక్కుపాదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు.. 850 కిలోల అనుమానాస్పద నెయ్యి స్వాధీనం – కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ శాఖ భారీ ఎత్తున ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులు కలిపి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో జూలై 14, 15 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు.

తనిఖీల్లో కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు ప్రాథమికంగా గుర్తించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి సేకరించిన నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపామని, నివేదికల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు.

**హైదరాబాద్‌లో 850 కిలోల నెయ్యి స్వాధీనం**

హైదరాబాద్‌లోని క్యూర్ (CURE) ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 14 సంస్థలను పరిశీలించారు. మొత్తం 15 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యిని అక్కడికక్కడే ధ్వంసం చేయగా, 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ప్రయోగశాల నివేదికల్లో కల్తీ నిర్ధారణ అయితే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

**65 సంస్థల్లో తనిఖీలు – 91 నమూనాల సేకరణ**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 65 సంస్థల్లో తనిఖీలు నిర్వహించి 91 నెయ్యి నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఐదు సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

**FSSAI ప్రమాణాలు తప్పనిసరి**

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలని, తేమ శాతం 0.5 శాతానికి మించరాదని కమిషనర్ వివరించారు. పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను నెయ్యిలో కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం-2006 ప్రకారం నిషేధమని స్పష్టం చేశారు.

**వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి**

వినియోగదారులు తప్పనిసరిగా FSSAI లైసెన్స్ ఉన్న విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు ఉత్పత్తిపై ఉన్న FSSAI లైసెన్స్ నంబర్, తయారీ వివరాలు పరిశీలించాలని, కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని కోరారు. కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.




## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కొరడా.. నలుగురికి జైలు శిక్ష

**సిద్ధిపేట, జూలై 17, ఆశ్వి అప్డేట్స్:**

సిద్ధిపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మంది డ్రైవర్లు పట్టుబడ్డారు. వీరిని సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం 51 మందికి మొత్తం రూ.5.62 లక్షల జరిమానా విధించారు. అలాగే ముగ్గురు డ్రైవర్లకు 10 రోజుల జైలు శిక్ష, మరో డ్రైవర్‌కు 5 రోజుల జైలు శిక్ష విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 28 మందికి ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.1.40 లక్షల జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలూ ప్రమాదంలో పడతాయని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానాతో పాటు జైలు శిక్ష, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానా వంటి కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

# సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల అవగాహన

**యాదాద్రి భువనగిరి, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, వాటి ఏర్పాటు అవసరంపై పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామ పెద్దలు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సంస్థల యజమానులు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి సీసీటీవీల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, కేసుల దర్యాప్తు వేగవంతం చేయడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పోలీసులు తెలిపారు. ప్రజలు, వ్యాపార సంస్థల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు సురక్షిత సమాజ నిర్మాణానికి సీసీటీవీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, వ్యాపారవేత్తలు తమ గ్రామాలు, దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని పోలీసులకు హామీ ఇచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి వ్యాపార సంస్థ, ప్రతి ఇంటిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.








# రోడ్డు భద్రతే పరమావధి.. టెక్నాలజీతో ప్రమాదాల నివారణ సాధ్యం

- నూతన ఆర్‌టీఓలకు ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఐపీఎస్ పిలుపు



**హైదరాబాద్, జూలై 17, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రవాణా శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. టెక్నాలజీ ఆధారిత అమలు, కట్టుదిట్టమైన ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

తెలంగాణ రవాణా శాఖకు చెందిన ముగ్గురు నూతన రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులకు (ఆర్‌టీఓలు) రెండు నెలల పాటు నిర్వహించిన ఇండక్షన్ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగిన వాలెడిక్టరీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ శాఖ అదనపు కమిషనర్ సి. రమేష్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసిన డి. జగదీష్, పి. భూషి రెడ్డి, చై సాయి చరణ్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ, యూనిఫాం సర్వీసులో తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల ప్రాణ భద్రతతో ముడిపడి ఉంటుందని, అందువల్ల మోటార్ వెహికల్స్ చట్టం, నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు. దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ, ఈ పరిస్థితిని మార్చేందుకు పోలీస్ శాఖతో పాటు రవాణా శాఖ కూడా సమాన బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి అంశాల్లో నాణ్యతను పెంచడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని ఆమె తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే మూడు ప్రధాన స్తంభాలపై దృష్టి సారించి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. అదనపు కమిషనర్ సి. రమేష్ మాట్లాడుతూ, పోలీస్ అకాడమీలో అందిస్తున్న శిక్షణ రవాణా శాఖ అధికారులకు చట్టపరమైన అవగాహనతో పాటు ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. గతంలో శిక్షణ పొందిన అధికారులు కూడా మెరుగైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన ఆర్‌టీఓలు మాట్లాడుతూ, ఈ రెండు నెలల ఇండక్షన్ ట్రైనింగ్ తమలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని మరింత పెంచిందన్నారు. ముఖ్యంగా అవుట్‌డోర్ శిక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, రవాణా శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.


# మహిళపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- సాక్ష్యాధారాలతో నేరం రుజువు.. రూ.37 వేల జరిమానా విధించిన న్యాయస్థానం

**సిద్ధిపేట, జూలై 17, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలపై జరిగే లైంగిక నేరాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమనే సందేశాన్ని ఇస్తూ, బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడు *జంగపల్లి సంతోష్ (33)*కు న్యాయస్థానం జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.37 వేల జరిమానా విధించింది. ఈ మేరకు గౌరవ న్యాయమూర్తి వై. జయప్రసాద్ తీర్పు వెలువరించారు.


2022 మార్చి 26న నమోదైన ఈ కేసులో అప్పటి సిద్ధిపేట రూరల్ సీఐ వి. జానకి రామ్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, బాధితురాలి వాంగ్మూలంతో పాటు ఇతర కీలక సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు బలమైన వాదనలు వినిపించగా, ప్రస్తుత ఎస్సై టి. తిరుపతి, సీఐ విద్యాసాగర్, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ రవి, భరోసా లీగల్ అధికారి సౌమ్య కేసు విచారణలో సమన్వయంతో సహకరించారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.37 వేల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించింది. ఈ సందర్భంగా సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ మాట్లాడుతూ, మహిళల భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని శిక్ష పడేలా కట్టుదిట్టమైన దర్యాప్తు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.



## సాంకేతికతతో సమర్థ పోలీసింగ్: ఎస్పీ సమీక్ష

**ఆశ్వి అప్డేట్స్**

జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐటీ సెల్ పనితీరును జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఐపీఎస్ సమీక్షించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన, సీసీటీవీ నిఘా బలోపేతం, CCTNS 2.0లో కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. 5S విధానంలో కార్యాలయాల నిర్వహణతో పాటు సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు.



## ప్రజాకవి అందెశ్రీ జయంతి: సీఎం రేవంత్ నివాళి

"జయ జయహే తెలంగాణ" గీత రచయిత, ప్రజాకవి అందెశ్రీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ఉద్యమ స్ఫూర్తిని అక్షరాల్లో ఆవిష్కరించిన మహోన్నత కవిగా అందెశ్రీని కొనియాడిన సీఎం, ఆయన సాహిత్యం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## పల్నాడులో క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం..

**నరసరావుపేట, పల్నాడు, ఆశ్వి అప్డేట్స్:**



గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, రైతులు, మహిళలు, యువత, సూక్ష్మ-చిన్న వ్యాపారులకు ఆర్థికంగా చేయూత అందించాలనే లక్ష్యంతో పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు), స్టార్టప్ వ్యవస్థాపకులు, యువ పారిశ్రామికవేత్తలు, చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలకు రుణాల పంపిణీ చేపట్టారు. బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయడం, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బ్యాంకులు అందించే రుణాలు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అవి కుటుంబాల భవిష్యత్తును తీర్చిదిద్దే పెట్టుబడులని పేర్కొన్నారు. ఒక రైతు పంట సాగుకు, ఒక యువకుడి స్వయం ఉపాధి కలలకు, ఒక మహిళ సాధికారతకు, ఒక చిరు వ్యాపారి వ్యాపార విస్తరణకు బ్యాంకు రుణాలు కీలక భూమిక పోషిస్తాయని ఆయన వివరించారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి సులభంగా రుణాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని పేర్కొన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి అందిస్తున్న మద్దతుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, బ్యాంకింగ్ సేవల విస్తరణలో కేంద్రం సహకారం కీలకమని ఆయన అన్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ఆర్థిక చేర్చివేత (Financial Inclusion) లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకులు మరింత చొరవ చూపాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బ్యాంకుల ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## జలంధర్ సభలో ప్రధానికి ఘన స్వాగతం

- **భారీగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన నరేంద్ర మోదీ**

**జలంధర్ (పంజాబ్), ఆశ్వి అప్డేట్స్:**

పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు విశేష సంఖ్యలో హాజరైన ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సభకు తరలివచ్చిన ప్రజల అపూర్వ ఆదరణ, అభిమానానికి తాను ఎంతో అభిభూతుడినయ్యానని పేర్కొన్నారు. "జలంధర్ జనసభలో భారీ సంఖ్యలో పాల్గొన్న పంజాబ్‌కు చెందిన నా సోదర సోదరీమణుల ప్రేమాభిమానాలకు నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజలు చూపిన ఆప్యాయత, విశ్వాసం నాకు మరింత బాధ్యతను గుర్తు చేసింది. దేశ అభివృద్ధి, పంజాబ్ పురోగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని తన సందేశంలో తెలిపారు. జలంధర్ సభలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, వ్యవసాయ రంగానికి చేపడుతున్న చర్యలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రధాని ప్రస్తావించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. పంజాబ్ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించినట్లు పేర్కొన్నాయి. సభకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరుకావడం పంజాబ్‌లో బీజేపీ బలోపేతానికి సంకేతమని పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. సభ అనంతరం ప్రజలు చూపిన ప్రేమాభిమానాలకు ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.









## జిల్లాలో పోలీస్ నిఘా మరింత పటిష్టం..

- **నైట్ బీట్ సిబ్బందికి ఆధునిక భద్రతా పరికరాలు**

**ఆశ్వి అప్డేట్స్**

ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా పోలీసు శాఖ కీలక చర్యలు చేపట్టింది. నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఎల్‌ఈడీ బ్యాటన్స్, ఫైబర్ లాఠీలను పంపిణీ చేశారు. రాత్రి వేళల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర సహాయం అందించడంలో నైట్ బీట్ వ్యవస్థ కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. సున్నిత ప్రాంతాలు, బ్యాంకులు, ఏటీఎంలు, బంగారు దుకాణాలు, కాలనీలు, జాతీయ రహదారులపై నిరంతర గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం అవసరమైన వారికి వెంటనే స్పందిస్తూ ప్రజల్లో భద్రతా భావం పెంపొందించేలా పోలీసులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.







# గ్యాస్ సిలిండర్ ఎక్కువ రోజులు రావాలంటే ఈ టిప్స్ పాటించండి

వంటగ్యాస్ ఎక్కువ రోజులు రావాలంటే ఏం చేయాలో ఈ టిప్స్ పాటించి తెలుసుకోండి. దీనిని వాడేటప్పుడు కొన్ని విషయాలు కచ్చితంగా గుర్తుంచుకోవాలి. సిలిండర్ మీరు సరైన డీలర్ నుంచి తీసుకున్నారని గుర్తుంచుకోండి. సిలిండర్ డెలివరీ అయినప్పుడు కంపెనీ సీల్, సిలిండర్ సరిగ్గా సీల్ చేశారో లేదోనని గుర్తుంచుకోవాలి. సీల్ చిరిగిపోతే దానిని వాడొద్దు. సిలిండర్ లోపల డేట్‌ని చూడాలి. ఏ అంటే జనవరి నుంచి మార్చి వరకూ అని బీ అంటే ఏప్రిల్ నుంచి జూన్ వరకూ అని సీ జులై నుండి సెప్టెంబర్ వరకూ అని డీ అక్టోబర్ నుండి డిసెబర్ వరకూ అని అర్థం. ఉదాహరణకు DFT-A-24 తేదీ ఉంటే అది మార్చి వరకూ వాడొచ్చు అని అర్థం. డేట్ ఎక్స్‌పైర్ అయితే ఆ సిలిండర్ వాడొద్దు. వాడే ముందు సోప్ వాటర్ పూస్తే గ్యాస్ లీకేజి గురించి తెలుసుకోవచ్చు.

**వంట చేసేటప్పుడు..**

అదే విధంగా, గ్యాస్‌పై వంట చేసేటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. మంచి వెంటిలేషన్ ఉండాలి.

తలుపు, కిటికీలు దెరిచి ఉంచాలి. మండే పదార్థాలు దగ్గర ఉండొద్దు. బట్టలు కూడా జాగ్రత్తగా వేసుకోవాలి.

సిలిండర్ వాడనప్పుడు రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గాలి వచ్చే చోట సిలిండర్‌స్‌ని పెట్టాలి.

**డైరెక్షన్ ఎలా ఉండాలి?**

సిలిండర్‌ని ఎట్టి పరిస్థితుల్లో పడుకోబెట్టొద్దు. నిలబెట్టాలి.

సంవత్సారినికి ఓ సారి రెగ్యులేటర్, ట్యూబ్‌ని మార్చాలి.

ఐఎస్ఐ సర్టిఫైడ్‌వి మాత్రమే వాడాలి. సురక్షితమైన పరికరాలను వాడాలి. సిలిండర్‌కి హాని కలిగించే పనులు చేయొద్దు. రెగ్యులేటర్ బర్నర్స్ నాబ్స్ మూసివేయండి.

వెంటిలేషన్ కోసం తలుపులు, కిటికీలు తెరవండి లైట్స్, మంటకి కారణమయ్యే వాటిని దూరమవ్వండి. లైట్స్, కరెంట్ స్విచెస్ ఆఫ్ చేయాలి. కరెంట్‌ని డిస్‌కనెక్ట్ చేయండి. మంటకి కారణమయ్యే వాటిని దూరం పెట్టండి.



# ఇలా చేశారంటే క్షణాల్లో తలనొప్పి మాయం

తలనొప్పిగా ఉంది అనే మాట మనం చాలా కామన్‌గా వింటాం. ఈ సమస్య రాగానే కొంతమంది తగ్గాలని ట్యాబ్లెట్స్ వేసుకుంటారు. అయితే, అలా కాకుండా తలనొప్పిని సహజంగానే తగ్గించేందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేంటో తెలుసుకుని తలనొప్పిని దూరం చేసుకోండి. నిజానికి తలనొప్పి రావడానికి చాలా కారణాలు ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, సరిలేని ఆహారం, ఎక్కువగా ఆల్కహాల్ తీసుకోవడం, కళ్ళు అదే పనిగా చూడడం, హైబీపీ, మైగ్రేన్స్, సైనస్, జలుబు, ధూమపానం, కాలుష్యం.. ఇవన్నీ కూడా తలనొప్పికి కారణాలే. అయితే, ఈ తలనొప్పిని తగ్గించేందుకు కొన్ని సహజ మార్గాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.

**నీరు తాగడం..**

డీహైడ్రేషన్ వల్ల కూడా తలనొప్పిగా ఉంటుంది. కాబట్టి, ఆ సమస్యని తగ్గించేందుకు నీటిని తాగండి. వీటితతో పాటు హెర్బల్ డ్రింక్స్ తాగొచ్చు. అల్లం టీ, లెమన్ టీల వంటివి రక్తనాళాల వాపుని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. వికారాన్ని తగ్గిస్తాయి.

**నమలొద్దు..**

కొంతమంది చూయింగ్ గమ్‌ని అదేపనిగా నములుతుంటారు. దీని వల్ల దవడ ప్రాంతం, బుగ్గల లోపలి భాగంలో నొప్పి ఉంటుంది. దీంతో తలనొప్పి తగ్గుతుంది. మెత్తని ఆహారాలు తినడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**మసాజ్..**

మనం జుట్టుని టైట్‌గా జడవేసిన తలనొప్పి వస్తుంది. కాబట్టి, జడని లూజ్‌గా వేసుకుని తలపై మెల్లిగా మసాజ్ చేయండి. దీని వల్ల చాలా వరకూ రిలాక్స్ అవుతారు. తలనొప్పి తగ్గుతుంది. నుదురు, మెడపై మెల్లిగా మసాజ్ చేస్తే ఒత్తిడితో వచ్చే టెన్షన్ తలనొప్పి తగ్గుతుంది. ఎసెన్షియల్ ఆయిల్‌తో కనుబొమ్మలు, నుదుటిపై మసాజ్ చేస్తే రక్త ప్రసరణ పెరుగుతుంది. పుదీనా, తులసి, లావెండర్ నూనెలు కూడా వీటికి హెల్ప్ చేస్తాయి.

**రెస్ట్ తీసుకోవడం..**

తలనొప్పిగా ఉన్నప్పుడు కాసేపు ఈ పని చేయకుండా రెస్ట్ తీసుకోండి. వీలైతే ఓ చీకటి గదిలో 1, 2 గంటలు పడుకోవడం, మొబైల్స్, గ్యాడ్జెట్స్ వాడకాన్ని తగ్గించడం, రెస్ట్ తీసుకోవడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**కోల్డ్ ప్యాక్..**

కొన్ని సార్లు అధిక వేడి కారణంగా కూడా తలనొప్పి పెరుగుతుంది. కాబట్టి, నుదుటిపై కోల్డ్ ప్యాక్‌ని అప్లై చేయండి. ఐస్ ప్యాక్స్‌ని మెత్తని గుడ్డలో పెట్టి నుదుటిపై అప్లై చేయండి. 15 నిమిషాల వరకూ ఇలానే చేస్తే తలనొప్పి తగ్గుతుంది. దీని వల్ల తలతిరగడం, మాట్లాడడంలో ఇబ్బంది, వంటి లక్షణాలు కూడా తగ్గుతాయి.

# షుగర్ పేషెంట్లు పరగడుపున పాలు, టీ తాగొచ్చా?

మధుమేహం ప్రస్తుతం అన్ని వయసులో వారిలోనూ కామన్ వ్యాధిగా మారిపోయింది. ప్రతి ఇంట్లోనూ ఒకరో ఇద్దరూ మధుమేహం పేషెంట్లు ఉంటున్నారు. ఈ క్రమంలో మధుమేహం వ్యాధిగ్రస్తులు ఎటువంటి ఫుడ్ తీసుకోవాలి.. వారు పరగడుపున పాలు, టీ తాగొచ్చా? తదితర అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం..

మధుమేహం అధిక రక్తంలో చక్కెర స్థాయిలను కలిగి ఉంటుంది. మధుమేహం వల్ల ప్యాంక్రియాస్ తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోతుంది లేదా మీ శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను ఉపయోగించగల సామర్థ్యాన్ని కోల్పోతుంది. ఇన్సులిన్ ఒక ముఖ్యమైన హార్మోన్, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది, మీ కణాలను శక్తి కోసం గ్లూకోజ్‌ని ఉపయోగించడానికి అనుమతిస్తుంది. మధుమేహంలో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి. టైప్ 1, టైప్ 2. రక్తంలో అధిక చక్కెర స్థాయిలతో వ్యవహరించేటప్పుడు మీరు పాలు టీ తాగినప్పుడు మీ శరీరానికి ఏమి జరుగుతుంది? ఆయుర్వేదం ప్రకారం, ఖాళీ కడుపుతో మిల్క్ టీ తాగడం వల్ల మీ రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చెడు సంకేతం. టీలోని కెఫిన్ రక్తంలో చక్కెర అసమతుల్యతను మరింత దిగజారుస్తుంది, ఇది మధుమేహంతో సంబంధం ఉన్న అసౌకర్యం మరియు ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. అందుకే మధుమేహం వ్యాధిగ్రస్తులు పాలు, టీ తాగొద్దని నిపుణులు సూచిస్తున్నారు.



# పోషకాల గని ఉసిరి...

ఉసిరి.. పోషకాల గని. దీనిని ఊరగాయలు, మార్మాలాడే, మిఠాయి, రసం, చ్యవన్‌ప్రాష్ రూపంలో వినియోగిస్తారు. ఉసరిలో యాంటీ ఆక్సిడెంట్, క్యాన్సర్ నిరోధక, శోథ నిరోధక లక్షణాలకు ఉన్నాయి. ఇది అత్యంత శక్తివంతమైన పండ్లలో ఒకటిగా పరిగణించబడుతుంది. అనేక వ్యాధులను నయం చేయడానికి ఉసిరిని వాడుతుంటారు. ఉసిరిలోనే అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఇవాళ ఉసిరి వల్ల కలిగే 6 అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



**కార్తికమాసంలో ఉసిరి సందడి మొదలవుతుంది. ఉసిరిలో.. షడ్రసాలలోని ఉప్ప తప్పింటి మిగిలిన అన్ని రుచులూ ఉంటాయి. ఉసిరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అందరికీ తెలుసు. చాలా మంది ఉసిరిని రెగ్యులర్‌గా తీసుకుంటూ ఉంటారు. ఉసిరి జ్యూస్ తాగినా , ఎండబెట్టి వరుగులు చేసినా, మురబ్బా చేసినా, రోటి పచ్చడి చేసినా, నిల్వ ఉండే ఊరగాయ చేసినా దీనిలోని పోషక విలువలు పదిలంగానే ఉంటాయి. ఉసిరిని సింపుల్‌గా సూపర్ ఫుడ్ అని పిలవచ్చు. ఆయుర్వేదంలో ఉసిరి వినియోగం చాలా ఎక్కువ. దీనిలో విటమిన్ సీ, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, కెరోటిన్, బీ–కాంప్లెక్స్‌తోపాటు ఇతర విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీనిలో ఔషధ గుణాలూ పుష్కలంగా ఉంటాయని నిపుణుల చెబుతున్నారు. ఉసిరి రోజు తీసుకుంటే కలిగే ప్రయోజనాలు తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.**





- రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఉసిరిలో పాలీఫెనాల్స్, విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఇది శరీరాన్ని వైరస్‌లు, బ్యాక్టీరియా నుండి రక్షిస్తుంది. అంతేకాదు.. ఆక్సీకరణ ఒత్తిడి నుండి కూడా రక్షిస్తుంది. మెరుగైన మెటబాలిజం నిర్వహించడానికి సహాయపడుతుంది.

- రక్తాన్ని శుభ్రపరుస్తుంది.. టాక్సిన్ చర్మం, జుట్టు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. శరీరంలో శక్తి స్థాయిని తగ్గిస్తుంది. ఉసిరిని తీసుకోవడం వల్ల శరీరంలో రక్తం, హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. శరీరంలో ఉండే చెడు పదార్థాలను బయటకు పంపిస్తుంది. ఉసిరి కాయలను తినడం వల్ల టాక్సిన్ స్థాయిలను తగ్గించవచ్చు. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరిస్తుంది.

- రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.. ఆమ్లాలో ఉండే పాలీఫెనాల్‌లు శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల నుండి రక్షిస్తుంది. ఉసిరి.. శరీరాన్ని ఇన్సులిన్ వైపు మరింత రియాక్టివ్‌గా చేస్తుంది. ఇన్సులిన్ శోషణను పెంచుతుంది. ఈ విధంగా రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. మధుమేహం లక్షణాలను తగ్గించడానికి పచ్చి ఉసిరి తినడం చాలా ప్రయోజనకరం. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది.

- జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. ఉసిరిలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మలబద్ధకం, విరేచనాలు మొదలైన జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ఇది కాకుండా, ఉసిరి తినడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఇది గ్యాస్ట్రిక్ రసాలను ప్రేరేపిస్తుంది. తద్వారా అసిడిటీని నివారిస్తుంది.

- మానసిక ఆరోగ్యానికి మంచిది.. ఉసిరిలో ఉండే ఫైటోన్యూట్రియంట్లు మెదడు కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్‌స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. అదనంగా, యాంటీఆక్సిడెంట్లు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది జ్ఞాపకశక్తిని పదును పెడుతుంది. ఇది శరీరంలో ఒత్తిడి తగ్గించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది కనుక ఇది మరింత ఉపయుక్తం అని చెప్పాలి.

- జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది.. ఆమ్లాలో విటమిన్ సి, టానిన్లు, అమైనో ఆమ్లాలు, అవసరమైన కొవ్వు ఆమ్లాలు జుట్టు పోషణను అందిస్తాయి. ఉసిరి నూనె జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తుంది. ఇది చుండ్రు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. జుట్టు పీహెచ్ స్థాయిలను బ్యాలెన్స్ చేసి.. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. నెత్తిమీద ఆమ్లా నూనెను మర్దనా చేయడం వల్ల జుట్టు అకాలంగా నెరిసిపోకుండా ఉంటుంది. జుట్టు యొక్క సహజ రంగును కాపాడుతుంది.



# టిప్స్ పాటిస్తేనే పకోడీ కరకరలాడు తుంది

- ఎర్రగా వేగి కరకరలాడుతూ ఉండే ఉల్లిపాయ తీపి మసాలాల పరిమళంతో ఇంకా ఇంకా తినాలనిపిస్తుంది. సాయంత్రాలు టీతో ఉంటో ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. చూడ్డానికి బాగా తెలిసిన రెసిపీలా అనిపిస్తుంది, కానీ కొన్ని పద్ధతులు టిప్స్ పాటిస్తేనే పకోడీ గట్టిగా కరకరలాడుతూ ఉంటుంది, లేదంటే మరో రుచితో మెత్తగా పకోడీ తయారవుతుంది కానీ ఈ తీరులో గట్టిగా కరకరలాడుతూ మాత్రం ఉండదు పకోడీ.
- కచ్చితంగా స్వీట్ షాప్ వారి తీరులో కారకరలాడే గట్టి పకోడీ ఇంట్లో చేయాలంటే కింద టిప్స్ చుడండి, అప్పుడు కచ్చితమైన రెసిపీ మీకు తెలుస్తుంది.
- ఉల్లిపాయ: ఉల్లిపాయ చీలికలుగా తరుక్కోవాలి. అంటే ఉల్లిపాయని మధ్యలో కోసి ఆ తరువాత నిలువుగా తరుక్కోవాలి. ఉల్లిపాయలు కూడా మరీ సన్నంగా తరుక్కోకండి. చిప్స్ చీరె స్లైసర్తో ఉల్లిపాయని చేరుకోవచ్చు కానీ మరీ సన్నగా రేకుల్లా వస్తాయ్ ఉల్లిపాయలు, అంత సన్నంగా ఉంటె నూనెలో పకోడీ వేగేలోపే ఉల్లిపాయ మాడిపోతుంది. మీ దగ్గర సైజు అడ్జస్ట్ చేసుకునే స్లైసర్ ఉంటె తప్పకుండా స్లైసర్ వాడుకోవచ్చు.
- పిండి కలిపే తీరు:మసాలాలు ఉల్లిపాయల్లో వేసి పిండితే నీరొస్తుంది ఉల్లిపాయల్లోంచి, అప్పుడు సెనగపిండి బియ్యం పిండి వేసి పిండి గట్టిగా తడిపొడిగా కలుపుకోవాలి. పిండి జారుగా తడితడిగా ఉండకూడదు. పిండి తడి పొడిగా గట్టిగా కాకుండా జారుగా నీరు నేరుగా ఉంటె మీకు గట్టి పకోడీ రాదు, మెత్తని పకోడీ వస్తుంది.
- కాబట్టి పిండుకున్న ఉల్లిపాయల్లో పిండి వేసి ఎక్కువగా వత్తకుండా కలుపుకుంటే సరిపోతుంది.
- నీరు: నిజానికి ఈ గట్టి పకోడీకి అసలు నీరు అవసరంలేదు. అవసరమైతే ఒక్క చెంచా వేసుకోండి చాలు.

**పకోడీ వేసే తీరు:**

- పిడికెడు పకోడీ పిండిని చేతిలోకి తీసుకుని గట్టిగా పిండుతూ నూనెలోకి వదలాలి అప్పుడు చిన్న చిన్న ముద్దలుగా నూనెలోకి పడుతుంది. అంతే గాని పిండిని చిన్న చిన్న ఉండలుగా వేయరు ఈ పకోడీ.

**పకోడీ వేపే తీరు:**

- మరిగే నూనెలో పకోడీ పిండి వేసి మీడియం ఫ్లేమ్ మీదే నిదానంగా వేపుకోవాలి. మీడియం ఫ్లేమ్ మీద వేగితేనే పిండి లోపలి దాకా ఉడుకుతుంది, నీరుగా ఉండే ఉల్లిపాయ ఎర్రగా వేగుతుంది. ఎక్కువ మంట మీద వేపితే పైన రంగొస్తుంది లోపల పిండిగ ముద్దగా నిపిస్తుంది పకోడీ.






# 'జైలర్ 2' తెలుగు హక్కులకు భారీ డిమాండ్..

సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదలకు ఎక్కువ సమయం లేకపోయినా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ బిజినెస్ మాత్రం ఇంకా పూర్తికాలేదని సమాచారం. దీనికి ప్రధాన కారణం 'జైలర్' తొలి భాగం తెలుగు రాష్ట్రాల్లో అంచనాలకు మించి విజయం సాధించడమే. ఆ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్న డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాభాలు రావడంతో, 'జైలర్ 2'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులకు భారీ ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు డిస్ట్రిబ్యూటర్లు వెనకడుగు వేస్తున్నారని సమాచారం. అందుకే సినిమాపై మంచి క్రేజ్ ఉన్నప్పటికీ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల బిజినెస్ పూర్తికాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను చివరకు ఏ సంస్థ లేదా డిస్ట్రిబ్యూటర్ దక్కించుకుంటారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.




## డిసెంబర్‌లోనే నందమూరి

# సింహం గర్జన..

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ NBK111. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఈ సక్సెస్‌ఫుల్ కాంబో రిపీట్ అవుతుండటంతో అటు నందమూరి అభిమానుల్లో, ఇటు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ విడుదల తేదీకి సంబంధించి ఒక ఆసక్తికరమైన సమాచారం ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. నందమూరి బాలకృష్ణ సినిమాలు సంక్రాంతి పండుగ సీజన్‌ను టార్గెట్ చేసుకుని వస్తుంటాయి. కానీ ఈసారి సరికొత్త వ్యూహంతో బాక్సాఫీస్ బరిలోకి దిగబోతున్నట్లు తెలుస్తోంది. చిత్ర బృందం NBK111 చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. డిసెంబర్ చివరి వారంలో వరుస సెలవులు ఉండటం ఈ సినిమా వసూళ్లకు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. గోపీచంద్ మలినేని మార్క్ పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్, బాలయ్య ఊరమాస్ మేనరిజమ్స్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రీలుక్ పోస్టర్స్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్స్ ప్రకారం అక్టోబర్ కల్లా షూటింగ్ మొత్తం పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అనుకున్న సమయానికి పనులు పూర్తయితే డిసెంబర్ 24న బాలయ్య బాక్సాఫీస్ వేట మొదలుకావడం ఖాయంగా కనిపిస్తోంది.

# "అభిమానుల ప్రేమే నా ఎనర్జీ: టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల"

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు అదృష్టం కలిసిరావడం లేదు. తన టాలెంట్ చూపించినప్పటికీ నిరాశనే ఎదురవుతోంది. ఆమె ఇటీవల నటించిన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. ముఖ్యంగా భారీ అంచనాలతో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్', 'పరాశక్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో ఈ భామపై విమర్శలు వస్తున్నాయి. ఈ వరుస ఫ్లాపుల వల్ల ఆమెను కొన్ని సినిమాల నుండి తొలగిస్తున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీనికి తోడు నెట్టింట ట్రోలింగ్ కూడా గట్టిగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీల ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన అభిమానుల కోసం తాను ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

తనకు అభిమానులను నేరుగా కలుసుకోవడం ఎంతో ఇష్టమని, వారి చూపే ప్రేమ, ఉత్సాహం తనకు కొత్త ఎనర్జీని ఇస్తాయని చెప్పుకొచ్చింది. తనలాంటి కళాకారులను ఎల్లప్పుడూ బ్రతికించేది ప్రేక్షకులేనని, అందుకే వారిని అలరించేందుకు భవిష్యత్తులో మరింత శ్రమించి మంచి సినిమాలను అందిస్తూనే ఉంటానని శ్రీలీల తన పేర్కొన్నారు. ఒకపక్క తెలుగులో ఎదురుదెబ్బలు తగులుతున్నా.. ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఆమె తమిళ, హిందీ భాషల్లోని స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ధనుష్ సరసన 'D55' సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది. వీటితో పాటు బాలీవుడ్‌లో కూడా అడుగుపెడుతూ.. క్రేజీ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన మోస్ట్ అవేటెడ్ లవ్ సాగా 'ఆషికి 3' సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైంది.





# గ్లామర్ షోతో బాలీవుడ్‌ను షేక్ చేస్తున్న తమన్నా..

తమన్నా బాలీవుడ్‌లో ఆఫర్స్ పెరిగాక గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు బోల్డ్ పాత్రలకు కూడా నో చెప్పడం లేదు. బ్యాడ్సాఫ్ బాలీవుడ్‌లో స్పెషల్ సాంగ్ కోసం విపరీతమైన స్కిన్ షో చేసిన మిల్కీ బ్యూటీ నెక్స్ మరో బోల్డ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐటమ్ సాంగ్స్ ఏ హీరోయిన్ కెరీర్‌నైనా కిల్ చేశాయేమో కానీ తమన్నా కెరీర్‌కు మాత్రం బూస్టప్ ఇచ్చాయి. ఇంకా చెప్పాలంటే స్పెషల్ సాంగ్స్‌తో కూడా కోట్లు కూడగట్టొచ్చని, ఆఫర్స్ పట్టొచ్చని ప్రూవ్ చేసింది. ఎంతో మంది స్టార్ బ్యూటీలకు ఇన్‌స్పిరేషన్‌గా మారింది. ఇంత వరకు ఓకే కానీ సౌత్‌లో హద్దులు మీరని గ్లామర్ షో చేసిన తమన్నా బాలీవుడ్ వెళ్లాక బోల్డ్ అండ్ రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోయి మరీ నటిస్తోంది. టాలీవుడ్‌లో చేస్తోన్న సినిమాలు ఫ్లాప్ కావడంతో ఆమెను లైట్ తీసుకుంటున్నారు ఇక్కడి మేకర్స్. కానీ బాలీవుడ్‌లో స్కిన్ షోతో బాగానే ఆఫర్స్ కొల్లగొడుతోంది. ఇప్పటికే చేతిలో వివాన్, రేంజర్, రోహిత్ శెట్టి సినిమాతో పాటు వి శాంతారం బయోపిక్ ఉన్నాయి. తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లోకి జాయిన్ అయ్యింది తమన్నా. బాలీవుడ్‌లో హారర్ ప్లస్ బోల్డ్ సిరీస్ థ్రిల్లర్ రాగిణి ఎంఎంఎస్ పార్ట్ త్రీలో యాక్ట్ చేస్తోంది మిల్కీ బ్యూటీ. రాగిణి3 సెట్స్‌లోకి ఎంటరైన పిక్ సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది తమన్నా. ఈ మూవీని శశాంక్ ఘోష్ డైరెక్ట్ చేస్తున్నాడు. పార్ట్ వన్ అండ్ టూ కన్నా మరింత భయంకరంగా, బోల్డ్‌గా తెరకెక్కించబోతున్నారట మేకర్స్. ఇందులో సల్మాన్ రిలేటివ్ ఆయుష్ శర్మ, అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్, నర్గీస్ ఫక్రీ కీ రోల్స్ ప్లే చేస్తున్నారు. బాలాజీ మోషన్ పిక్చర్స్, టిప్స్ ఫిల్మ్స్, జై హో మీడియా వెంచర్స్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి.






# తెలుగు చిత్ర పరిశ్రమపై నటి రకుల్ ప్రశంసలు

తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల్లో ప్రముఖ నటిగా గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా రెండు ఇండస్ట్రీల మధ్య ఉన్న వ్యత్యాసాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో ఒకరికొకరు ఇచ్చే మద్దతు, సహకారం బాలీవుడ్‌లో కనిపించవని ఆమె అభిప్రాయపడ్డారు. ''తెలుగు సినీ పరిశ్రమ నన్ను ఎప్పుడూ ప్రేమగా చూసుకుంది. అక్కడ తోటి నటులు, దర్శకులు, నిర్మాతలు ఒకరినొకరు ఎంతగానో ప్రోత్సహించుకుంటారు. ఒకరి సినిమా ట్రైలర్‌ను మరొకరు ప్రమోట్ చేస్తారు. అందరూ కలిసి ఈవెంట్లకు వెళ్తారు. సినిమాల సక్సెస్ పార్టీలను సెలబ్రేట్ చేసుకుంటారు. టాలీవుడ్‌లో మేం ఇతరుల చిత్రాల ప్రత్యేక స్క్రీనింగ్‌లు, ప్రీమియర్‌లకు వెళ్తాం. సినిమా గురించి మాట్లాడుకుంటాం. ఒకరికొకరు తోడుగా నిలబడతాం. తాభావం ఎక్కువ. పక్క సినిమాను సపోర్ట్ చేయడానికి అక్కడి వారు పెద్దగా ఇష్టపడరు. నేను ముంబయికి వచ్చిన తర్వాతే ఈ విషయాన్ని గమనించాను. అక్కడ కూడా టాలీవుడ్ లాంటి వాతావరణం ఉంటే బాగుంటుంది. కానీ, అక్కడి వారిలో ఉన్న అభద్రత వల్ల అది సాధ్యం కావడం లేదు. ఈ పరిస్థితిని మార్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకరికొకరు సపోర్ట్ చేసుకుంటేనే చిత్ర పరిశ్రమలు మరింత బలంగా మారుతాయని నేను నమ్ముతాను'' అని రకుల్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S